

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 3: సబ్‌జూనియర్ బాలుర జాతీయస్థాయిహ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లానుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లాహ్యాండ్‌బాల్ అసోసియేషన్‌అధ్యక్షుడు గోనె శ్యాం సుందర్‌రావు, ప్రధానకార్యదర్శి కె రమేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన కెరఘు, కౌటాలకు చెందిన డి యోగి, కార్తీక్, ఆసిఫాబాద్‌కు చెందిన బి సాయివర్ధన్ ఉన్నట్లు తెలిపారు. వీరుఈనెల 3నుంచి7వరకు హైద రాబాద్‌లో జరిగే జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీ ల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఒలింపిక్‌సభ్యులు రఘునాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మీనా రెడ్డి, ఫణిరాజా, సాంబశివరావు, అరవింద్, కల్యాణ్, రాకేష్, సాయి అభినందించారు.

'పెండింగ్ వేతనాలు ఇవ్వాలి'

ఆసిఫాబాద్, అక్టోబరు 3: పెండింగ్‌లో ఉన్న ఎని మిది నెలల వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఏఎన్ ఎంలు గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేందర్, కృష్ణమాచారి, మహేశ్వరి, కృష్ణ వేణి, సునీత, రమాదేవి, హీరాబాయి, పూల బాయి, సుజాత, శ్రీదేవి, ప్రమీల పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి

- పంటకు అనుకూలంగా వాతావరణం
- ఏపుగా పెరుగుతున్న మొక్కలు
- చీడ పీడల బెడద ఈసారి తక్కువే



చింతలమానేపల్లి, అక్టోబరు 3: వానాకాలంలో పత్తి పంటకు అనుకూలంగా వర్షాలు కురిశాయి. జిల్లాలో పత్తిపంట సాగుచేసిన రైతుల్లో దిగుబడి పై ఆశలు మొదలయ్యాయి. ఆరుతడి పంట అయిన పత్తి పంటకు కలిసివస్తోంది. పత్తిగింజలు విత్తినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చీడపీడల బెడద కూడా తక్కువగానే ఉండడంతో పత్తి మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాయదశలో ఆశాజనకంగా ఉంది. దసరాలోపు మళ్లీ ఒక్కసారి వర్షం కురిస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. పత్తిని చూసిన రైతులు, వ్యవసాయ అధికారులు మంచి ధర పలికే అవకాశం ఉన్నదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి వాతావరణం అనుకూలించడంతో రెట్టింపు ఉత్సాహంతో రైతులు పత్తిపంటపై సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గులాబీ, చీడపురుగులు రాకుండా ఎప్పటి కప్పుడు నివారణ చర్యలు చేపడుతున్నారు.

ధరలు ఇలా..

గతేడాది పత్తిపంటకు కేంద్రం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020 ప్రకటించగా, ఈఏడాది అదనంగా క్వింటాల్‌కు రూ.501పెంచారు. దీంతో ప్రస్తుత క్వింటాల్ మద్దతు ధర రూ.7,521 ఉంది. క్వింటాల్‌కు కనీసం రూ.8వేల పైన ఉంటే లాభదాయకంగా ఉండే అవకాశం ఉంటుందని రైతులు, రైతు సంఘం నాయకులు అంటున్నారు. ఆరుతడి పంట అయినా పత్తికి ఈ సారి వాతావరణం అనుకూలంగా ఉంది. మరో నెలరోజులు ఇలాగే వాతావరణం ఉంటే రైతులకు పత్తిపంట చేతికి వచ్చే అవకాశం ఉన్నది.

జిల్లాలో 3.6లక్షల ఎకరాల్లో పత్తి పంట..

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ల పరిధిలోని 15మండలాల్లో 3.6లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. జిల్లాలో పత్తి పంట మొదటి స్థానంలో ఉండగా, వరిపంట 58వేల ఎకరాల్లో రెండవ స్థానంలో ఉంది. మొదట్లో ఆశించినస్థాయిలో వర్షాలు పడకపోవడంతో కొంత ఇబ్బంది పడ్డా..ఆ తర్వాత వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో రైతులు పత్తి పంటలో కలుపు ఏరి దౌర కొట్టారు. గతేడాది ఆశించిన స్థాయి లో పత్తి దిడుబడి రాకపోవడంతో రైతులు కొంతమేర నష్టపోయారు. ఈసారి వర్షాలు కురుస్తుండడంతో రైతులు పత్తిపంటను కంటికి రెప్పలా కాపాడు కుంటున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

రామకృష్ణ, వ్యవసాయాధికారి, చింతలమానేపల్లి

ఈసారి పత్తి పంటకు వాతావరణం అనుకూలం గా ఉంది. ఇప్పటివరకు రైతులు దోమమందు పిచి కారి చేశారే తప్ప ఎలాంటి చీడపీడల బెడద లేదు. పత్తికి అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతు లు ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటిక ప్పుడు పత్తి పంట చూసుకుంటూ దానికి తగ్గట్టుగా సస్య రక్షణ చర్యలు తీసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుంది.

ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 3: వివిధ పద్ధతుల్లో జరుగుతున్న ఆర్థికమోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దాసరి వేణు, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఏజీఎం రాధికభరత్‌తో కలిసి అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులకు ఆర్థికమోసాలు, నగదురహిత లావాదేవీలు, ఆర్థికఅక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదన్నారు. బ్యాంకుఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, పిన్‌నెంబరు ఇతరులకు తెలపకూడదన్నారు. పాస్‌వర్డ్, ఓటీపీవివరాలు ఇతరులకు చెప్పకూడదని తెలిపారు. ఆర్థికమోసానికి గురైతే వెంటనే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా టోల్‌ఫ్రీ నెం.1930కు తెలియపర్చాలన్నారు. సమీపబ్యాంకుకు వెళ్లి వెంటనే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత అగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఆర్థికఅక్షరాస్యత సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏఈఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడ్‌డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి..

అనుమతులులేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సర్వేబృందాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ కిందవచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువుశిఖం, వాగులు, ప్రభుత్వభూములు, రైల్వేలైన్ సమీపంలో ఉన్న ప్లాట్ల రికా ర్డులు పరిశీలించాలన్నారు.

కోర్టుకేసులు ఉన్న ప్లాట్ల వివరాలను దరఖాస్తుల వివరాలను పరిశీలించి సంబంధిత అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే బృందాలు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని దరఖాస్తుదారుడి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరిశీలన పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి యశ్వంత్, పంచాయతీ కార్యదర్శులు, గిర్దావర్, నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధ్రువపత్రాలు పరిశీలించాలి..



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా చేపడుతున్న ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలనకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఒక్కో పోస్టుకు ముగ్గురి ధ్రువపత్రాలను పరిశీలిస్తామన్నారు. ఇందుకుకోసం 766 మంది అభ్యర్థులను పిలిచామని, ఇప్పటివరకు 157మంది అభ్యర్థులు వచ్చారని, తెలిపారు. ఈనెల 5న ధ్రువపత్రాల పరిశీలన ముగుస్తుందన్నారు. అభ్యర్థులు సకాలంలో వచ్చి సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

వసుంధర కళాశాలలో బతుకమ్మ సందడి



పూజలు నిర్వహిస్తున్న కరస్పాడెంట్ రాజమౌళి



బతుకమ్మ ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్, అక్టోబరు 3: కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర ఇంటర్, డిగ్రీ కళాశాలలో గురువారం బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా బతుకమ్మను విద్యార్థినులు, లెక్చరర్లు ఏర్పాటు చేశారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ కుడిక్యాల రాజమౌళి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు బతుమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దహెగాం, అక్టోబరు 3: మండలకేంద్రంలోని రైతువేదికలో సామాజికతనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒకప్రకటనలో తెలిపారు. ఏప్రిల్1, 2023, మార్చి31,2024వరకు జరిగిన ఈజీఎస్ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికనిర్వహిస్తున్నట్లు తెలిపారు.కూలీలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలన్నారు.

చేతిపంపులపై శిక్షణ

బెజ్జూరు, అక్టోబరు 3: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్ మంచినీటి సహాయకులకు చేతి పంపులకు వచ్చే మరమ్మతులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోచేతిపంపుల ద్వారా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మంచినీటి సహాయకులపై ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి), అక్టోబరు 3: కౌటాల 33కేవి ఫీడర్‌లైన్‌లో మరమ్మతుల కారణంగా సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల్లో శుక్రవారం ఉదయం 8నుంచి 10గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ తెలిపారు. వినియోగదారులు గమనించి సహరించాలని కోరారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్/సిర్పూర్(టి), అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల స్థానంలో నూతనంగా ఫ్యామిలీ డిజిటల్‌కార్డులు అందజేసేందుకుగాను జిల్లాలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని వార్డు నం.3లో, సిర్పూర్(టి)మండలంలోని వెంకట్రావుపేటలో గురువారం సర్వే పనులను ఎంపీడీవోలు శ్రీనివాస్, సత్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

డీఎస్సీ ర్యాంకర్లకు సన్మానం

సిర్పూర్(టి), అక్టోబరు 3: మండలంలో డీఎస్సీలో ర్యాంకులు సాధించిన శ్రీధర్,వేణు, సాయిని గురువారం బీజేపీనాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అశోక్,మహేష్, జావీద్‌అహ్మద్,రవి,రాజశేఖర్,గణేష్ పాల్గొన్నారు.



అధికారిని సన్మానించిన జీఎం

రెబ్బెన, అక్టోబరు 3: జాతీయస్థాయిలో అందించే కోల్‌ఇండియా ఉత్పా దకఅవార్డును అందుకున్న బెల్లంపల్లి ఏరియా డీజీఎం(ఐఈ) ఉజ్వల్‌కుమార్‌ను జీఎం శ్రీనివాస్ గురువారం సన్మానించారు. జీఎం మాట్లాడుతూ ఇటీవల జంషెడ్‌పూర్‌లో దేశవ్యాప్తంగా 140కి పైగా సంస్థలు సెమినార్‌లో పాల్గొనగా సింగరేణి సంస్థలో బెల్లంపల్లిఏరియా అధికారికి అవార్డు రావ టం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కెరాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్ పాల్గొన్నారు.



డీజీఎం(ఐఈ) ఉజ్వల్‌కుమార్‌ను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

మైసమ్మ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

శ్రీరాంపూర్, అక్టోబరు 3: దసరా పండుగను పురస్కరించుకొని ఆర్కే6గనిపై ఉన్న మైసమ్మ ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి ఈనెల 12వరకు కొనసాగుతాయి. గనిమేనేజర్ ఈ తిరుపతి సతీసమేతంగా ఆరంభ పూజలు చేశారు. కార్యక్రమంలో రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమా ధికారి సురేందర్, ఇంజనీర్ ఆర్ మహేష్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: అమ్మవారి ఆశీస్సులతో ఏరియా మరింతప్రగతిపథంలో నడవాలని ఏరియాజీఎం దేవేందర్‌అన్నారు. గురువారం వెంకటేశ్వరాలయంలో దుర్గామాత ప్రతిష్ఠాపనపూజల్లో పాల్గొని ప్రత్యేకపూజలుచేశారు. జీఎం మాట్లాడుతూ నవరాత్రిఉత్సవాలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వెంకటేశ్వరస్వామి పల్లికిసేవ ఉండనుండగా భక్తులకు ప్రత్యేకసౌకర్యాలుఏర్పాటుచేశామన్నారు. ఎస్‌వోటూజీఎంరాజేశ్వర్‌రెడ్డి దంపతులు, ఆలయపూజారి అజయ్ దంపతులు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీఆవరణలోని దుర్గామాత ఆలయంలో జీఎం శ్రీనివాస్ దంపతులు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి తిరుపతి, ఖైరిగూడ పీవో దంపతులు ఎం నరేందర్, నళిని, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన జీఎం

రెబ్బెన, అక్టోబరు 3: జాతీయ సబ్‌జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఉతమక్రీడాకారుడిగా అవార్డు అందుకున్న గోలేటి సింగరేణి స్కూల్ విద్యార్థి దామెర ప్రేందీప్‌ను బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ గురువారం అభినదించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. ఎస్‌వోటు జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులే ఐఎన్‌టీయూసీ లక్ష్యం

మందమర్రిటౌన్, అక్టోబరు 3: కార్మికులహక్కులే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని యూనియన్ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లిసమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య తెలిపారు. గురువారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.ఈనెల6నశ్రీరాంపూర్‌లో యూనియన్ బెల్లంపల్లి రీజియన్ మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సభకునాయకులు, కార్మికులు తరలిరావాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్

ఆసిఫాబాద్, అక్టోబరు 3: వానాకాలం సీజన్ వరిధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, అదనపుకలెక్టర్‌లు, ఆర్డీవోలు, ఇతర జిల్లా అధికారులతో వానాకాలం ధాన్యం కొనుగోలు, డీఎస్సీ-2024మెరిట్ జాబితాఅభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనపై సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం సేకరణకు జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలికసదుపాయాలు కల్పించడంతోపాటు రైస్‌మిల్లర్ల సమన్వయంతో నిర్ణీత గడువులోగా లక్ష్యసాధన దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సరిహద్దుల వద్ద తనిఖీకేంద్రాలు ఏర్పాటుచేసి వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, సహకార, ఐకేపీ, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్సీ మెరిట్ జాబితా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సకాలంలో పూర్తిచేసి ఈనెల9న నియామకపత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్‌లు దాసరివేణు, దీపక్‌తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వర్కర్స్‌కు వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 3: పెండింగ్‌లో ఉన్న 12నెలల వేతనాలు చెల్లించాలని ఐఎఫ్ టీయూ ఆధ్వర్యంలో గురువారం బీసీహాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులు కలెక్టరేట్‌ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం డీబీసీడీవో సజీవన్‌కు వినతిపత్రంఅందజేశారు. కార్యక్రమంలోనాయకులు బ్రహ్మానందం, తిరుపతి, కొమురయ్య, అన్సర్, లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల, లలిత, పోశక్క, సరోజ, అమిత్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఆదివాసీ తుడుందెబ్బ నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 3: ఆదివాసీ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం ఆదివాసీ తుడుందెబ్బసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుటధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాకవిజయకుమార్ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో రద్దు చేసిన బాలికల ఆశ్రమఉన్నతపాఠశాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. క్రీడాపాఠశాలలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకడీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయఖాళీలను భర్తీచేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ దాసరివేణుకు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు భాస్కర్‌రావు, సుభాష్‌భాస్కర్, మారుతి, మురళీపాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, అక్టోబరు 3: ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం ఆయన మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ధనోరగ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ కార్డు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. రేషన్‌కార్డు, హెల్త్ కార్డు తోపాటు ఇతర ప్రభుత్వపథకాలలో ఈకార్డు ప్రయోకరంగా ఉంటుందన్నారు. దశలవారీగా అన్నిగ్రామాల్లో సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించిడిజిటల్‌కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నోడల్‌అధికారి లోకేశ్వర్‌రావు, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శులు బొజ్జిరావు, సతీష్‌రావు, అంబారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

పెంచికలపేట, అక్టోబరు 3: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారి సుప్రజ అన్నారు. గురువారం మండలంలోని మురళీగూడ గ్రామంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలునాటిన నాలుగుసంవత్సరాల అనంతరం పంట చేతికి వస్తుందని తెలిపారు. ఒక్కసారి మొక్కలు నాటితే 30 ఏళ్లపాటు దిగుబడి పొందవచ్చన్నారు .కార్యక్రమంలో మాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

నస్పూర్, అక్టోబరు 3: గంజాయికి అలవాటు పడిన ఏడుగురిని పట్టుకున్నామని సీఐ ఆకుల అశోక్, ఎస్సై సుగుణాకర్ తెలిపారు. భద్రాచలం నుంచి గంజాయి తీసుకువచ్చి బుధవారం తీగల్‌పహాడ్ క్రషర్ మిల్లు సమీపంలో కలుస్తున్నారని అందిన పక్కా సమాచారం మేరకు నిఘా వేసి పట్టుకున్నామని తెలిపారు. గోదారి రాజు, జాడి వంశీ (నస్పూర్), సాయికుమార్ (మంచిర్యాల)లను పట్టుకోగా మిగిలిన వారు పారిపోయారన్నారు. వీరి వద్ద నుంచి కిలోన్నర గంజాయి సుమారు రూ.30వేలతోపాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌ను కలిసిన మల్లేష్

వేమనపల్లి, అక్టోబరు 3 : రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాల లక్ష్మిని గురువారం మండలానికి చెందిన ఓయూ జేఏసీ కోఆర్డినేటర్ దుర్గం మల్లేష్ హైద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సన్మానించారు. బీసీ సంక్షేమానికి కృషి చేయాలని విన్నవించారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కాసిపేట, అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సోమగూడెం(కే) పంచాయతీలో సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద సోమగూడెం(కే) ఎంపిక చేశామన్నారు. సర్వే సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్ళి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్ ఆలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.


సోమగూడెం(కే)లో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

దండేపల్లి: కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి సూచించారు. అల్లీపూర్ గ్రామ పంచాయతీలో సర్వేను పరిశీలించారు. అర్హులైన ప్రజలందరికి కుటుంబ డిజిటల్ కార్డు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇంటింటా చేపట్టే సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే పైలట్ ప్రాజెక్టుగా అల్లీ పూర్ గ్రామ పంచాయతీని ఎంపిక చేశారు. ఆర్డీవో రాములు సర్వే తీరును పరిశీలించారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో విజయ్‌ప్రసాద్ ఉన్నారు.

చెన్నూరు: సంకారంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. నియోజకవర్గ నోడల్ అధికారి గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ ఆలీ, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న శేజల్

బెల్లంపల్లి, అక్టోబరు 3: మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని ఆరిజన్ డెయిరీ సీఈవో శేజల్ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. కన్నాల శివారులోని అసైన్డ్ భూమిని తన సొంత భూమి అని చెప్పి మాజీ ఎమ్మెల్యే రూ.30 లక్షలు తీసుకున్నాడని వినతి పత్రంలో పేర్కొన్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత అసైన్డ్ భూమి అని తెలిసిందని, గత ప్రభుత్వ హయాంలో న్యాయం చేయాలని ఆందోళన చేసినా ఫలితం లేదన్నారు. ఈ విషయంపై విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూడాలని, మాజీ ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాట్సాప్, సోషల్ మీడియాలో స్పందిస్తూ రూ.30 లక్షలు తీసుకున్నట్లు ఆధారాలతో రుజువు చేసి ప్రజల మధ్య బయట పెడితే రూ.60 లక్షలు చెల్లిస్తానని, అసత్యపు ఆరోపణలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని పోస్టు చేశారు.

మంచిర్యాలలో కల్తీ మద్యం విక్రయాలు

గర్మిళ్ల: మంచిర్యాలలో కల్తీ మద్యం అమ్ముతున్న మాధవి వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఆరిజన్ డెయిరీ సీఈవో శేజల్ అన్నారు. గురువారం మంచిర్యాలలో విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ రెండురోజులనుంచి సుమారు రూ.25వేల విలువగలమద్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అబ్కారీశాఖ అధికారులకు మద్యాన్ని పంపుతున్నట్లు ఆమె తెలిపారు. బాటిల్‌మూతలుతీసి నీటిని కలిపి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని, స్పిరిట్‌ను కూడా కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో మాధవి వైన్స్ యజమానిపై పలు స్టేషన్లలో కల్తీ మద్యం కేసులు నమో దయ్యాయని గుర్తు చేశారు. ఆదినారాయణ ఆళ్ల వంశీకృష్ణ, ఆర్‌టీఐ ఫోరం జిల్లా కమిటీసభ్యులు రేఖప్రియదర్శిని, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది ప్రతిభ గుర్తించడానికి డ్యూటీ మీట్

కోల్‌సిటీ, అక్టోబరు 3: అధికారులు, సిబ్బంది ప్రతిభ గుర్తించడానికి కాళేశ్వరం జోన్‌లో జోన్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్టు సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల, పెద్దపల్లి, కుమరంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని అధికారులు, సిబ్బందికి జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 14 నుంచి 18వరకు జరిగే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీలు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడ పోటీలు

హాజీపూర్, అక్టోబరు 3: గుడిపేట బెటాలియన్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ట్రైనీ కానిస్టేబుళ్లను గ్రూపులుగా విభజించి పరుగు పందెం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, టగ్ ఆఫ్ వార్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కమాండెంట్ వెంకటరాములు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాసులు, అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 3: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కార్యచరణ సిద్ధం చేయాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. టార్పాలిన్లు, గన్నీ సంచులను సిద్ధంగా ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పౌరసరఫరా అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ, వ్యవసాయదికారి కల్పన, సంజీవరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

డీఎస్‌సీ 2024 మెరిట్ లిస్టులో స్థానం కలిగి ఉన్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కార్మెల్ ఉన్నత పాఠశాలలో డీఈవో యాదయ్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెరిట్ లిస్టులో ఉన్న 715 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రికార్డులు సరిచూసి క్షేత్రస్థాయిలో ప్లాట్ల భౌగోళికస్థితిని పరిశలించి త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు చెరువు, వాగుల భూముల రికార్డులను పరిశీలించాలని, వీటి పరిధిలో ప్లాట్లు ఉంటే దరఖాస్తులను తిరస్కరించి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలన్నారు. డీపీవో వెంకటేశ్వర్ రావు, డీటీసీపీ సంపత్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ

హాజీపూర్, అక్టోబరు 3: మొక్కల పెంపకంతోనే మానవాళికి మనుగడ సాధ్యమవుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, డిప్యూటీ తహసీల్దార్‌హరిత, ఏపీఎం మల్లయ్య, ఏపీఎం రాజన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడి మృతి

నస్పూర్, అక్టోబరు 3: నస్పూర్ మున్సిపాలిటీలో ట్రాలీ డ్రైవర్‌గా పని చేస్తున్న మాసు రాజశేఖర్(32) అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రి మండలం గుడిపెల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ 2018 నుంచి అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సీసీసీ కార్నర్ వద్ద మున్సిపల్ ఛైర్మన్ సుర్మిళ్ళ వేణు, కమిషనర్ చిట్యాల సతీష్ మౌనం పాటించి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.పది వేలు అందజేశారు.

నలుగురు దొంగల అరెస్టు

సుల్తానాబాద్, అక్టోబర్ 3: తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీకి పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి యాపల్‌కు చెందిన పిట్టల సురేందర్, మందమర్రి విద్యానగర్‌కు చెందిన శంకరయ్య, బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన గోషిక కార్తీక్, మందమర్రి చెర్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌లు ఉన్నారు. వీరి ముఠాలోని గుర్రాల చిన్న భూమయ్య, రాము పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

చెరువు మత్తడి ధ్వంసం కేసులో ఏడుగురు అరెస్టు

చెన్నూరు, అక్టోబరు 3: పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. గురువారం చెన్నూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గతంలో నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు. విచారణ అనంతరం పట్టణానికి చెందిన నడిపెల్లి లక్ష్మణ్‌రావు, మంచాల రాజబాపు, పెద్దింటి శ్రీనివాస్, లక్కం రాజబాపు, పోగుల శేఖర్, ఇప్ప సంపత్, ఉమేష్ గిల్డా, బత్తుల సమ్మ య్య, ఎన్నం బానయ్య, రాంలాల్‌గిల్డా అనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చెరుకు బుచ్చిరెడ్డికి సంబంధించిన 15.20 ఎకరాలను కొనుగోలు చేశారు. అనంతరం పట్టణానికి చెందిన గొడిసెల బాపురెడ్డికి రూ.7.50 కోట్లకు విక్రయించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

4.20 ఎకరాల భూమి మాత్రమే బాపురెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యింది. మిగితా 11 ఎకరాల భూమి శనగకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉండడంతో రిజి స్ట్రేషన్ కాలేదు. దీంతో ఇరుపార్టీల మధ్య వివాదం ఏర్పడిందన్నారు. యేటా వర్షాకాలంలో చెరువు నిండడంతో బాపురెడ్డి భూమి వద్దని, డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఈ లావాదేవి నుంచి బయట పడేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక పథకం రచించారన్నారు. 11వ వార్డులోకి చెరువు నీరు వస్తుండడంతో కౌన్సిలర్ పెండ్యాల స్వర్ణలత భర్త లక్ష్మీనారాయణ అదే కాలనీకి చెందిన భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లను ఆశ్రయించారు. చెరువు మత్తడిని ధ్వంసం చేయాలని వారితో రూ.4 లక్షల డీల్ కుదుర్చుకున్నారన్నారు. చెరువు మత్తడి ధ్వంసానికి ఆర్థికంగా సహకరించిన ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురు రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, ఎన్నం బానయ్యలు పరారీలో ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు. ఈ కేసులో పట్టణానికి చెందిన గొడిసెల బాపురెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కేసును ఛేదించిన ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు శ్వేత, సుబ్బారావు, కానిస్టేబుళ్ల రాజశేఖర్, భూమన్నలను డీసీపీ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


ప్రేమ్‌సాగర్ (ఫైల్)

కోటపల్లి, అక్టోబరు 3: మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌సాగర్ (28) గురువారం బైక్ అదుపు తప్పి కింద పడి మృతిచెందాడు. శెట్‌పల్లిలోని చిన్నమ్మ ఇంటికి వెళ్లిన ప్రేమ్‌సాగర్ తిరిగి కోటపల్లికి వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులతో పాటు కుటుంబీకులు 108 అంబు లెన్స్‌లో చెన్నూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి తల్లి సాలక్క, భార్య మమత ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి సర్వీసు రోడ్డు వద్ద ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాంటెంకి రాజేష్ (20) మృతిచెందాడు. రాజేష్ గురువారం ద్విచక్ర వాహనంపై స్నేహితుడు నాగరాజుతో కలిసి తాండూర్ మండలం బోయపల్లికి వెళ్లాడు. తిరిగి రాజేష్ వస్తుండగా మందమర్రి సర్వీసు రోడ్డు వద్ద ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మంచి ర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రాజేష్ (ఫైల్)


తిర్యాణిలో అమ్మవారికి ముక్కుపుడక పెడుతున్న మహిళ


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కాగజ్‌నగర్ బాలాత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు, రెబ్బెనలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దసరా శరన్నవరాత్రులు ప్రారంభం

బెజ్జూరు/దహెగాం/సిర్పూర్(టి)/తిర్యాణి, అక్టోబరు 3: మండలాల్లో గురువారం శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటుగ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలువనున్నారు. ఈసందర్భంగా మండలకేంద్రాలతో పాటు పలుగ్రామాల్లో భాజాభజంత్రీల మధ్య దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిర్యాణి మండలంలో గౌడసంఘంఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహానికి గౌడ కులస్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

కాగజ్‌నగర్/రెబ్బెన: నవరాత్రిఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో స్వయంభువుగా వెలసిన శ్రీమహంకాళిఆలయంలో తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరి అవతారంలోదర్శనమిచ్చారు. రెబ్బెనలో హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయకమిటీసభ్యులు, భక్తులుపాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

భీమారం, అక్టోబరు 3: మండల కేంద్రంలోని సర్వే నెంబరు 138లోని ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కావేటర్‌ను గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. 138 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి అని, రైతు వేదిక, స్టేడియం ప్రాంతాల్లో మట్టి తీయడం వల్ల గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. సీజ్ చేసిన వాహ నాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఎస్‌ఐ రాములు మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలించేందుకు ఉపయోగించిన ట్రాక్టర్ ఓనర్లు శ్రీనివాస్, ఎక్స్‌కావేటర్ యజమాని పున్నంపై కేసు నమోదు చేశామని తెలిపారు.

విద్యుదాఘాతంతో చిన్నారులకు గాయాలు

వాంకిడి, అక్టోబరు 3: మండల కేంద్రానికి చెందిన షేక్‌సమీరా(11) షేక్ రెహాన్ (10) అనేఇద్దరు చిన్నారులకు గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ అజ్మోద్దిన్ కూతురు షేక్ సమీరా, షేక్‌జలావుద్దిన్ కుమారుడు షేక్‌రెహాన్ ఇంటిముందు ఆడుకుంటుండగా బాల్ ఇంటి రేకులపై పడింది. బాల్ తీసుకోవడానికి రేకులపైకి ఎక్కిన చిన్నారులకు పైనున్న 11కేవీ విద్యుత్‌తీగలు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు ఇద్దరినీ మహారాష్ట్రలోని చంద్రపూర్ ప్రైవేట్ అసుపత్రికి తరలించారు. షేక్‌సమీరా పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. షేక్‌సమీర 4వ,షేక్‌రెహాన్ 3వతరగతి చదువుతున్నారు. సంఘటనస్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ పరిశీలించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

తిర్యాణి, అక్టోబరు 3: మండలంలోని సుంగాపూర్ గ్రామానికి చెందిన మారుబాయిపై దాడిచేసిన అదేగ్రామానికి చెందిన ఆత్రంరాజుపై కేసునమోదు చేసినట్లు ఎస్సైమాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ చేనులో ఉన్న మారుబాయిని ఆత్రం రాజు బాడిషతో దాడి చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఆమె భర్త మారు, కుమారులు గాయపడిన మారుబాయిని వెంటనే చెలిమెల ఆసుపత్రికి తరలించారు. మారుఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

హాజీపూర్, అక్టోబరు 3: హాజీపూర్ బస్టాప్ ఆటోలో తరలిస్తున్న 150కిలోల పీడీఎస్‌బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్‌ఐసురేష్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన తూర్పాటిచంటి ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా బస్టాప్‌వద్ద ఆటోను ఆపితనిఖీ చేయగా బియ్యం లభించిందన్నారు.చంటిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

● 30కి పైగా బైక్‌లు స్వాధీనం

బెజ్జూరు, అక్టోబరు 3: మండలంలోని మొగవెల్లి గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో కోడిపందేల స్థావరంపై కౌటాల సీఐరమేష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడిలో కోడిపందేలు ఆడుతున్న15మందిని అదుపులోకి తీసుకోగా మరికొందరు పారిపోయారు. 30కిపైగా బైక్‌లు, రూ.3,280నగదుతో పాటు నాలుగుకోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐతెలిపారు. పక్కాసమాచారంమేరకుచింతలమానేపల్లి, బెజ్జూరు ఎస్సైలు నరేష్, విక్రమ్‌తో కలిసి ఈ దాడులు చేపట్టామని పేర్కొన్నారు. పందేలు నిర్వహిస్తున్న వారివివరాలను సేకరిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కమ్మేసిన ఎస్పీఎం పొగ

కాగజ్‌నగర్, అక్టోబరు 3: పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానాన్ని గురువారం ఉదయం ఎస్పీఎం నుంచి వెలువడిన పొగ కమ్మేసింది. వాకింగ్ చేసేందుకు వచ్చిన వారికి ఏమీ కనిపించలేదు. పొగతో కళ్లలో మంటలు, ఉదరసంబంధిత వ్యాధులు వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎస్పీఎం నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.


ఎస్పీఎం గ్రౌండ్‌లో పొగ

వర్షాలు కురవాలని పూజలు

పెంచికలపేట, అక్టోబరు 3: మండలవ్యాప్తంగా కొన్నిరోజులుగా వర్షాలు లేకపోవడంతో వరి,మిరప,పత్తిపంటలుఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మండలకేంద్రంలో రైతులు, యువకులు, పిల్లలు కప్పతల్లి ఆటలు ఆడారు. వరుణుడు కరుణించాలని మహిళలు గ్రామదేవతలకు బిందెలతో జలాభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.


కప్పతల్లి ఆటలు ఆడుతున్న గ్రామస్థులు, యువకులు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాల కూల్చివేత

- ఆర్అండ్‌బి స్థలంలో మార్కెట్ నిర్మాణం
- నిర్మాణంపై మొదటి నుంచి విమర్శలు
- పిల్లర్ల దశలో ఉన్న నిర్మాణం కూల్చివేత
- ఆ స్థానంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం
- రూ. 50 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కూల్చివేత

మంచిర్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనాలోచిత నిర్ణయాలతో అనువుగాని చోట నిర్మించదలచిన భవన నిర్మాణాన్ని కూల్చివేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథిగృహం ఆవరణలో రెండు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమీకృత మార్కెట్ భవన నిర్మించేందుకు ప్రతిపాదించారు. సుమారు రూ.7 కోట్ల అంచనా వ్యయంతో జీ+2 అంత స్థులతో భవన నిర్మాణం ప్రారంభించగా వివిధ కారణాలతో పిల్లర్ల దశలో పనులు నిలిచిపోయాయి. అయితే సమీకృత మార్కెట్ సముదాయానికి ఎంపిక చేసిన స్థలంపై అధికారులు, ప్రజాప్రతినిధులపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం భవనం కోసం నిర్మించిన పిల్లర్లను కూల్చివేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.2.5 కోట్లు వెచ్చించి పిల్లర్ల నిర్మాణం చేపట్టగా ఆ నిధులన్నీ వృథా అయ్యాయి.

ఎంసీహెచ్ కోసం స్థలం ఎంపిక

ప్రస్తుతం భవన నిర్మాణాన్ని కూల్చిన స్థలంలో గతంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఆ స్థలానికి ఎదురుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండటం, ప్రతిపాదిత స్థలంలో ఎంసీహెచ్ భవనం నిర్మిస్తే వైద్యంకోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటుందని అప్పటి అధికారులు సైతం అభిప్రాయ పడ్డారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఉండటంతో బస్సుల్లో ప్రయాణించే వారికి సౌకర్యవంతంగా ఉండటంతోపాటు రెండు ఆస్పత్రులకు మధ్య జాతీయ రహదారి ఉండటంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే చికిత్స పొందేందుకు వెసలుబాటు కలుగుతుందనే నిర్ణయానికి వచ్చారు. ఎంసీహెచ్ కోసం దాదాపు స్థలం ఎంపిక పూర్తయ్యే సమయానికి ఆకస్మాత్తుగా స్థలమార్పిడి జరిగింది. ఎంసీహెచ్‌ను గోదావరి నది ఒడ్డున నిర్మించడంతో తరుచుగా వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. దీంతో అందులో చికిత్స పొందే గర్భిణీలు, బాలింతలు, శిశువులను మరోచోటుకి తరలించాల్సి వస్తోంది. ఈ కారణంగా వారంతా ఇబ్బందులు పడుతుండగా, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు చొరవతో ఎంసీహెచ్ మళ్లీ ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలోకే రానుంది.

రూ. 50 కోట్లకు అనుమతులు మంజూరు

ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాన్ని కూల్చి వేస్తున్నందున ఆ స్థలంలో సూపర్ స్పెషా లిటీ ఆసు పత్రి నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఇప్పటికే స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించగా, తెలంగాణ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ తొలి విడుతగా రూ.50 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ గత నెల 12న జీవోఆర్టీ నెంబర్ 546ను విడుదల చేసింది.

ఎంసీహెచ్ కూడా అక్కడే

ప్రస్తుతం గోదావరి సమీపంలో ఉన్న ఎంసీహెచ్‌ను కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలోకి మార్చనున్నారు. ఈ మేరకు ఆస్పత్రి ప్రాంగణంలో ప్రత్యేక భవన నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంసీహెచ్ రెండు ఒకే ప్రాంగణంలో నిర్మించడం రోగులకు వైద్యసేవల పరంగా అందుబాటులో ఉండనున్నాయి.



సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం నమూనా

కార్పోరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్...

ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు హామీలో భాగంగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ. 300 కోట్ల అంచనాతో ఏడు అంతస్తులతో ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టనుండగా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు ప్రజలకు అందను న్నాయి. ఈ మేరకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి మార్గం సుగమం కాగా రెండున్నర సంవ త్సరాల కాలంలో భవన నిర్మాణం పూర్తికా నుంది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం తో మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు పొరగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందను న్నాయి. గురువారం ప్రతిపాదిత స్థలం వద్ద ఎమ్మెల్యే ఆస్పత్రి భవన సముదాయం నమూనా చిత్రాన్ని ప్రదర్శించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కాసిపేట, అక్టోబరు 3 : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ముత్యంపల్లి ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. గురువారం జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాతీయ వన్య ప్రాణుల వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఈనెల 2 నుంచి 8 వరకు జాతీయ వన్య ప్రాణి వారోత్సవాలను యేటా నిర్వహిస్తున్నామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత, వాటికి హానీ కలిగించవద్దన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, బీట్ ఆఫీసర్ శ్రీదర్, సిబ్బంది సురేష్,వెంకటస్వామి, అంజని ప్రసాద్,రమేష్, చిరంజీవి, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మీ, సత్తమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న బండి సదానందంయాదవ్

మందమర్రిటౌన్, అక్టోబరు 3: నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పాలనలో కుంభకోణాలే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఇటీవల 3500 మందికి 500కే గ్యాస్ సిలిండర్ ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు. రాజన్న పాల్గొన్నారు.

వ్యాపారులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



వ్యాపారితో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 3: మంచిర్యాల మార్కెట్ వ్యాపారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమ కట్టడాల పేరుమీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాద్ వెరబెల్లి అన్నారు. గురువారం వ్యాపార సముదాయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాత్రికి రాత్రి మార్కింగ్‌లు చేసి సమాచారం ఇవ్వకుండా వ్యాపార సముదాయాలను కూల్చడం వారిని ఆర్థికంగా దెబ్బతీయడమేనన్నారు. దసరా, దీపావళి పండగల సందర్భంగా వ్యాపారం జరుగుతుందని, ఈ సమయంలో వ్యాపార సముదాయాలను కూల్చి వారి పొట్టకొట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, జిల్లా అధికార ప్రతినిధి రాకేష్, నాయకులు రమేష్, అశ్విన్, శ్రీదేవి, రాకేష్ రేణ్వా పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నస్పూర్, అక్టోబరు 3: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. సుందరయ్య కాలనీలో గురువారం సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఒకటవ వార్డు ఇన్‌చార్జీ శ్రీనివాస్, సదయ్య, నాయకులు వెంకటస్వామి, అనూష, తిరుపతి, సదానందం, పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లికి చెందిన కంపెల అజయ్‌కుమా ర్, కొండ రవిలు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. వెంకటకృష్ణ, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

మహిళలు ఇబ్బందులకు గురైతే షీటీమ్‌ను సంప్రదించాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3: కమిషనరేట్ పరిదిలోని మహిళలు, బాలికలు, విద్యార్థుల భద్రతే లక్ష్యంగా షీటీమ్‌లు పని చేస్తున్నాయని, ఎలాంటి ఇబ్బంది కల్గినా సంప్రదించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీటీమ్‌లు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తారని సీపీ తెలిపారు. 6303923700కు కాల్ చేసి, వాట్సప్ సందేశం, 100కు డయల్ చేసి సాయం పొందాలని సూచించారు. గత నెలలో 8 ఫిర్యాదులు రాగా పెద్దపల్లి కార్యాలయానికి 5, మంచిర్యాలకు 2, వాట్సప్ ద్వారా 1 వచ్చాయని తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి యవకుడికి గాయాలు

భీమిని, నవంబరు 3: లక్ష్మీపూర్‌లో విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి గురువారం యువకుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిలుముల రాజ్‌కుమార్ గ్రామంలో విద్యుత్ బల్బులు అమర్చుతున్నాడు. విద్యుత్ సరఫరా కావడంతో షాక్ గురై పక్కనే ఉన్న రేకుల షెడ్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసినప్పటికీ ఎల్‌సీ తీసుకోకపోవడంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదం చోటుచేసు కుంది. రాజ్‌కుమార్‌ను మంచిర్యాలలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

పుస్తెలతాడు చోరీ

జన్నారం, అక్టోబరు 3 : దేవునిగూడలో ఓ మహిళ మెడలో నుంచి 2 తులాల బంగారు పుస్తెలతాడును చైన్ స్నాచర్ గురువారం మధ్యాహ్నం దొంగలించాడు. దంతనపల్లికి చెందిన చింతకింది రమ్య దేవునిగూడలో బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా వాహనంపై వచ్చిన చైన్ స్నాచర్ పుస్తెలతాడును దొంగలించాడు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

ఈనెల 7 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 3: జిల్లాలో ఈ నెల 7 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సదరం శిబిరాలను అర్హత గల వారు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందేందుకు మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హాజరు కావాలని తెలిపారు. నూతన సదరం సర్టిఫికెట్, రెన్యువల్ కోసం సకాలంలో హాజరు కావాలని కోరారు.

మంచినీటి పథకాల నిర్వహణపై శిక్షణ

నెన్నెల, అక్టోబరు 3: గ్రామాల్లోని మంచినీటి పథకాల నిర్వహణపై భీమిని, కన్నెపల్లి మండలాల మల్టీపర్పస్ వర్కర్లకు అధికారులు శిక్షణ ఇస్తున్నారు. భీమినిలో నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. జీపీకి ఒక్కరిని ఎంపిక చేసి బోర్‌వెల్ రిపేరు, సింగిల్‌ఫేస్, త్రీఫేస్ మోటార్ల మరమ్మతు, తాగునీటి నాణ్యతాప్రమాణాల పరీక్షలు, పైపులైన్ల లీకేజీ, నల్లాల రిపేరుపై శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎంపీడీవో గంగామోహన్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోషం పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : మంచిర్యాల పట్టణ సుందరీకరణలో భాగంగా మార్కెట్ ఏరియాలో షాపింగ్ మాల్స్ సముదాయాల ఎదుట ఉన్న ఆక్రమణల తొలగింపు పనులను మున్సిపల్ అధికారులు గురువారం ప్రారంభించారు. అధికారులు తొలగింపు పనులు చేపడుతుండగా వ్యాపారస్తులు సమయం కావాలని కోరారు. దీంతో ఒక రోజు సమయం ఇచ్చారు. ఈ విషయమై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సంపత్‌ను అడగగా వ్యాపారులకు ఇచ్చిన సమయం ముగిసిన వెంటనే తొలగింపు పనులు కొనసాగుతాయన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 3: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పని ప్రదేశాలను గుర్తించాలని, ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. ఏపీవో రజియాసుల్తానా, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత

మందమర్రిటౌన్, అక్టోబరు 3: పట్టణంలోని 8వ వార్డులో రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను మహిళలకు గురువారం యూత్ కాంగ్రెస్ నాయకులు మహంత్ అర్జున్‌కుమార్, జనార్దన్‌లు అందజేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆర్‌పీ సరోజ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి : ఎమ్మెల్యే వినోద్



బెల్లంపల్లిలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

బెల్లంపల్లి, అక్టోబరు 3: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం 13వ వార్డులో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తర్వాత రూ.60 కోట్ల నిధులతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి జలాలను అందించేందుకు పనులను ప్రారంభించినట్లు తెలి పారు. దసరా పండగ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులకు లక్ష రూపాయల విరాళం అందిం చారు. కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు వీల్‌చైర్ ఎమ్మెల్యే అందిం చారు. కౌన్సిలర్ బండి ప్రభాకర్, మున్సిపల్ చైర్‌ప ర్సన్ జక్కుల శ్వేత, ఆర్డీవో హరికృష్ణ, పట్టణాధ్య క్షుడు ముచ్చర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ దేవాలయం అభివృద్ధికి కృషి

బెల్లంపల్లిరూరల్: బుగ్గ దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. కన్నాల గ్రామం నుంచి బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయం వరకు రూ.3 కోట్ల నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. రోడ్డు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాసాడి శ్రీదేవి, నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, రాంచందర్, మునిమంద రమేష్, శంకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

కన్నెపల్లి: మండల కేంద్రంలో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి రూ.1.43 కోట్ల వ్యయంతో భవనం నిర్మిస్తున్నామన్నారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఎంపీడీవో గంగామోహన్, భీమిని పీహెచ్‌సీ వైద్యుడు కుమారస్వామి, ఏఎన్ఎంలు, నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠధామం నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 3: జిల్లా కేంద్రంలోని గోదావరి నదీతీరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం సమీపంలో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం వైకుంఠధామం ప్లాన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14వ ఫైనాన్స్ నిధులు రూ.4కోట్లతో అన్ని సౌకర్యాలను సమకూరుస్తూ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేష్, కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ మసూద్ అలీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి పాల్గొన్నారు.

ఈ నెల 7న ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 3: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగ, శిక్షణ విభాగం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వై.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబాయ్‌లో డెలివరీ బాయ్స్ ఖాళీలున్నాయని, వాటి భర్తీకి మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్హత కల్గి, ద్విచక్ర వాహన డ్రైవింగ్ లైసెన్స్ వుండాలని, పాస్‌పోర్ట్, ఆధార్‌కార్డ్, 21-41 యేండ్ల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఈమేయిల్ tomcom.resume@gmail.comకు మెయిల్ చేయాలని, వివరాలకు 9440051285, 9440048500, 9701040062, 9440051452 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పీడీఎస్‌యూ సభ పోస్టర్ల విడుదల

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 3: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల పోస్టర్లను గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24న ఉస్మానియా యూనివర్శిటీ ఠాగూర్ స్టేడియంలో జరిగే ఉత్సవాలకు విద్యార్థులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మనోహర్, సాయి, రిషికుమార్, ప్రణయ్, కుమార్, అజయ్, వంశీ, రాజు, స్వరూప పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేతపై హర్షం

గర్మిళ్ల, అక్టోబరు 3: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 నవంబర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్దు మాతా శిశు ఆసుపత్రి ముద్దు అనే కార్యక్రమం చేశామని, ఆ సమయంలో మార్కెట్ నిర్మాణం పిల్లర్ల వరకు కూడా కాలేదన్నారు. అప్పుడే నిర్మాణం నిలిపివేస్తే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేదన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బెటాలియన్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న కమాండెంట్, అధికారులు, చెన్నూరులో దుర్గామాత వద్ద దీక్ష తీసుకున్న స్వాములు

దండేపల్లి, అక్టోబరు 3: దేవీ శరన్నరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యే క పూజలతో ఒడి బియ్యం పోశారు. దుర్గామాతను మహిళలు మంగళహారతితో ఊరేగింపుగా తీసుకవచ్చారు.

హాజీపూర్: గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన మండపంలో కమాండెంట్ వెంకటరాములు ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముల్కల్లలో దుర్గామాత విగ్రహదాతలు కోట శ్రీనివాస్ విజయ, లెక్కల వెంకటేష్ లావణ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని సుద్దాల గ్రామంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారి మాలను ధరించారు. 9 రోజులపాటు అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు. మాలధారణ వేసుకున్న భక్తులు 9 రోజులపాటు నియమనిష్ఠలతో కొలుస్తారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో దసరా శరన్నవరాత్రుల వేడకలు ప్రారంభమయ్యాయి. ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారిని భకులు భక్తిశ్రద్ధలతో దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతులతో దుర్గాదేవి ప్రతిమలను ఊరేగింపుగా మండపాలకు తరలించి ప్రతిష్ఠించారు. ప్రత్యేక నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని సీతారాంపల్లి గోదావరి పుష్కర ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తొమ్మిది రోజుల భవాని దీక్షలు స్వీకరించారు. ఉదయం నుంచి భక్తులు గోదావరి నదికి చేరుకుని స్నానాలు ఆచరించి నది నీటిని ఇళ్లకు తీసుకెళ్లారు.

మందమర్రిటౌన్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆయా కాలనీల్లో దుర్గామాత విగ్రహాలు కొలువుదీరాయి. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, సాయిబాబ, ఆలయం, 1,2,3వ జోన్‌లో, ప్రాణహిత కాలనీల్లో ప్రతిష్ఠించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందమర్రిలోని కేకే 5 గనిలోని మైసమ్మ ఆలయంలో దుర్గామాతకు అధికారులు, నాయకులు, కార్మికులు పూజలు చేశారు.

కోటపల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో దేవి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో నాలుగు చోట్ల దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. మండపాలను సుందరంగా అలంకరించగా అమ్మవారి ప్రతిమలను మంగళహారతులు బ్యాండు మేళాలతో తీసుకువచ్చి ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.